JANA NIRNAYAM TELUGU DAILY
# జన నిర్ణయం
తెలుగు దినపత్రిక
తెలంగాణ
సంపుటి -16 సంచిక - 212 22-9-2026, మంగళవారం ఎడిటర్ : దామెర రాజేందర్ పేజీలు : 4 వెల 5 / -

## సూక్తి



నువ్వు మనస్ఫూర్తిగా
నవ్వాలంటే,
ముందు నీ బాధతో నువ్వు
ఆడుకోవాలి.
-- చార్లీ ఛాప్లీన్
ప్రపంచ ప్రఖ్యాత కళాకారుడు

## పిల్లలకు దగ్గు మందు వాడకంపై కేంద్రం కీలక చర్యలు..



హైదరాబాద్ : నాలుగేళ్లలోపు చిన్నారులకు దగ్గు మందు వాడకాన్ని తగ్గించేలా ఔషధ నియంత్రణ సంస్థ కీలక మార్పులకు సిద్ధమవుతోంది. దగ్గు మందు సీసాలపై 'నాలుగేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదకరం' అంటూ ఎరుపు రంగులో హెచ్చరిక ముద్రించాలని ప్రతిపాదించింది. ప్యాకేజింగ్‌పై పాఠశాల వయస్సు పిల్లల చిత్రాన్ని కూడా ఉంచే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనను డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ పరిశీలనకు పంపారు. కాగా, ఈ ఏడాది జూన్‌లో కేంద్రం దగ్గు మందులు, సిరప్‌లను ఓటీసీ విభాగం నుంచి తొలగించి.. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేసింది.




## కేరళంలో బీభత్సం సృష్టిస్తున్న వర్షాలు..

తిరువనంతపురం: కేరళంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, బురద ప్రవాహాలు, ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. దీంతో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. భారీ వర్షాలకు మలప్పురం జిల్లాలోని కొట్టపుళ నదికి వరదనీరు పోటెత్తింది. అయితే, ఆదివారం సాయంత్రం వాందూర్‌కు చెందిన ఐదుగురు స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. ఒక్కసారిగా ఆకస్మిక వరద రావడంతో ఐదుగురూ కొట్టుకుపోయారు.

వారిలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరిని స్థానికులు ప్రాణాలతో కాపాడారు. సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని గల్లంతైన వారి కోసం గాలిస్తున్నాయి. మరోవైపు, కొట్టాయం జిల్లా వేలతుస్సేరి వద్ద ఆదివారం సాయంత్రం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తమిళనాడుకు చెందిన సంగీత అరుల్ లాల్ (35) అనే మహిళ మృతి చెందగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. అలాగే, ఇడుక్కి జిల్లా కొట్టకంబూర్‌లో వర్షం కారణంగా నిన్న మధ్యాహ్నం ఓ షెడ్డులో తలదాచుకున్న ముగ్గురిపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ఓ మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీసన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, వర్షాల్లో చిక్కుకున్న వారికి సహాయం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు పరిస్థితిని అంచనా వేయడానికి విపత్తు నిర్వహణ అథారిటీ కమిషనర్ విఘ్నేశ్వరి.. ఇడుక్కి, కొట్టాయం జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఇడుక్కి, కొట్టాయం జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు, మరికొన్ని గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 21 : హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్‌లో 'హోమా జవీజు 2026' జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు.

ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌లను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సమగ్ర హెల్త్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకొచ్చారు.

డయాబెటిస్, మెటబాలిక్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి అవసరమని మంత్రి తెలిపారు. లైఫ్‌స్టైల్ డేటా విశ్లేషణతో వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉందని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని సూచించారు. హెల్త్‌కేర్ రంగంలో కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వైద్య నిపుణులు, పరిశోధకులు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

## చాలా ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం: మంత్రి పొంగులేటి



రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు. అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా.. ప్రజలు ఉండలేని చోట ఇళ్లు నిర్మించింది. మేం రద్దీగా ఉండే, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి, ఇళ్లు ఇస్తున్నాం. పేదలయితే చాలు.. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తాం" అని తెలిపారు.

## ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్, సెప్టెంబర్ 21 ( : ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రి సీతక్క ఈరోజు (సోమవారం) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో తీవ్రత అందరికీ తెలుసునని.. ఈ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలను ప్రవేశపెట్టాలని మంత్రి సీతక్క మార్గనిర్దేశం చేశారు. ఆయా గ్రామాల వారీగా అవసరాలు, నిధుల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యం క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించాలని సూచించారు

ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలి..

ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా మానిటరింగ్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు

## ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు.. ప్రారంభించనున్న అమిత్ షా




: దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌చీఫ్‌ల 3వ జాతీయ సదస్సును రేపు(మంగళవారం) ఢిల్లీలో నిర్వహించనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. దేశంలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఇందులో భాగంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయనున్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి 2026-29 నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్‌లో నిర్దేశించిన లక్ష్యాలపై సదస్సులో చర్చ జరగనుంది. రాష్ట్రాల్లో అమలవుతున్న చర్యలు, ఎదురవుతున్న సవాళ్లు, సమాచార మార్పిడి, దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పనిచేస్తున్న డ్రగ్ కార్టెల్స్‌ను గుర్తించి, వాటిని ఛేదించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా కొత్త రకాల సింథటిక్ డ్రగ్స్, వాటి తయారీకి ఉపయోగించే సీక్రెట్ ల్యాబొరేటరీస్, అక్రమ సరఫరా నెట్‌వర్క్‌లను గుర్తించి అడ్డుకోవడంపై చర్చించన్నట్టు తెలుస్తోంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని జరుగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా కూడా సదస్సులో కీలకం కానుంది. డార్క్‌నెట్ ద్వారా జరుగుతున్న డ్రగ్స్ విక్రయాలు, క్రిప్టోకరెన్సీ ఆధారిత లావాదేవీల వంటి నేరాలను గుర్తించడం, వాటిపై సమర్థంగా దర్యాప్తు చేయడం, నిందితుల ఆర్థిక నెట్‌వర్క్‌లను ఛేదించడం వంటివి ఇందులో ఉన్నాయి.

JANA NIRNAYAM TELUGU DAILY
జన నిర్ణయం
తెలుగు దినపత్రిక
మంగళవారం
22 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## నీటి సంరక్షణ నుంచి మూసీ పునరుజ్జీవనం వరకు..

## తెలంగాణకు కొత్త పర్యావరణ దిశ

తెలంగాణ అభివృద్ధి చర్చలో నీటి భద్రత, పర్యావరణ పరిరక్షణ, నగర పునరుద్ధరణ అంశాలు కేంద్రస్థానంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణ, నీటి వనరుల పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం వంటి కార్యక్రమాలు ఒక్కోటి విడివిడిగా కనిపించినా, అవన్నీ కలిసి భవిష్యత్తు తెలంగాణకు పర్యావరణ ఆధారిత అభివృద్ధి నమూనాను సూచిస్తున్నాయి. సుమారు 44 వేల చిన్నపాటి సాగునీటి వనరుల్లో 28 వేల చెరువులను మ్యాపింగ్, జియోట్యాగింగ్, పునరుద్ధరణ చర్యలతో అనుసంధానించడం ద్వారా సాగునీటి విస్తీర్ణం స్థిరపడిందని ప్రభుత్వం చెబుతోంది.

చెరువు అనేది కేవలం నీటిని నిల్వ చేసే గుంట కాదు. అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. సాగు, పశుపోషణ, భూగర్భ జలాల పెరుగుదల, జీవ వైవిధ్యం, గ్రామీణ ఉపాధి--- ఇవన్నింటికీ చెరువులు పునాది. గతంలో అభివృద్ధి పేరుతో వాగులు, చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. ఫలితంగా వర్షం పడితే వరదలు, ఎండాకాలంలో నీటి కొరత అనే ద్వంద్వ సమస్యలు తలెత్తాయి. చెరువుల గొలుసు వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా నీటి ప్రవాహాన్ని సహజ మార్గాల్లో నిర్వహించగలిగితే, ఒక ప్రాంతంలో పడిన వర్షం మరొక ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చేలా చేయవచ్చు.

తెలంగాణ నీటి సంరక్షణ మోడల్‌లో ముఖ్యమైన అంశం చెరువులను విడిగా కాకుండా పరస్పర అనుసంధానిత వ్యవస్థగా చూడటం. పైభాగంలోని చెరువు, దాని దిగువకు చేరే కాల్వ, మిగులు ప్రవాహ మార్గం, చివరికి కలిసే దిగువ నీటి వనరు---ఇవన్నీ ఒక గొలుసుగా పనిచేస్తాయి. ఈ గొలుసులో ఒక భాగం దెబ్బతిన్నా మొత్తం వ్యవస్థపై ప్రభావం పడుతుంది. అందుకే ఆక్రమణల తొలగింపు, కాల్వల పునరుద్ధరణ, నీటి ప్రవాహ మార్గాల పరిరక్షణ, గ్రామస్థాయి పర్యవేక్షణ వంటి చర్యలు సమాంతరంగా సాగాలి.

హైదరాబాద్ నగరానికి మూసీ నది పునరుజ్జీవనం అత్యంత కీలక అంశం. నగర చరిత్ర, సంస్కృతి, జీవన విధానంతో ముడిపడిన మూసీ నది గత కొన్నేళ్లుగా కాలుష్యం, అక్రమ నిర్మాణాలు, మురుగు ప్రవాహం, నదీ పరీవాహక ప్రాంతాల ఆక్రమణలతో తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు నది పునరుద్ధరణను నగర సుందరీకరణ కార్యక్రమంగా కాకుండా జలవనరుల నిర్వహణ, మురుగు శుద్ధి, వారసత్వ సంరక్షణ, ప్రజా స్థలాల అభివృద్ధి అనే సమగ్ర దృక్కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. మూసీ తీరంలోని చారిత్రక భవనాల పునరుద్ధరణకు అంతర్జాతీయ సంస్థల సహకారం కోరడం కూడా సరైన దిశ. నగరంలో ఉన్న వారసత్వ కట్టడాలు గతాన్ని గుర్తు చేసే స్మారక చిహ్నాలే కాకుండా భవిష్యత్తు నగర ఆర్థిక వ్యవస్థకు ఆధారాలు.

# విరసం 56 ఏళ్ల చరిత్రను సమీక్షించుకుని కొత్త దిశలోకి మారగలుగుతుందా?

విప్లవ రచయితల సంఘం విరసం 56 సంవత్సరాల చరిత్రను పూర్తి చేసుకుంది. ఇటీవల ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో మరోసారి విరసం వార్తల్లోకి వచ్చింది. అయితే విరసం గురించి చర్చ కేవలం నిషేధాలు, అరెస్టులు, అనుమతుల నిరాకరణల చుట్టూ తిరగకూడదు. 56 సంవత్సరాల సాహిత్య సాంస్కృతిక ప్రయాణంలో సమాజాన్ని ఎంతవరకు ప్రభావితం చేసింది, ప్రజల్లో సమానత్వం ప్రజాస్వామ్యం ప్రజా సంస్కృతి పట్ల చైతన్యాన్ని ఎంతవరకు పెంచింది, మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితులను ఎంతవరకు తన సాహిత్యంలో ప్రతిబింబించింది అనే ప్రశ్నలను కూడా నిజాయితీగా పరిశీలించాలి.

విరసం మార్క్సిజాన్ని తన ప్రాపంచిక దృక్పథంగా స్వీకరించిందా లేదా అన్నది మాత్రమే ప్రధాన ప్రశ్న కాదు. సోషలిస్టు విప్లవ లక్ష్యాలతో ప్రజలను చైతన్యవంతం చేయాలని భావించిన ఒక సాహిత్య సంస్థగా దోపిడీ అణచివేత వివక్షకు వ్యతిరేకంగా సమానత్వ సంస్కృతిని ప్రజాస్వామిక సంస్కృతిని అభివృద్ధి చేయడానికి ఎంత విస్తృతమైన పాత్ర పోషించింది అన్నదే ముఖ్యమైన ప్రశ్న.

విరసం ఆవిర్భవించిన 1970ల కాలాన్ని నేటి పరిస్థితులతో పోల్చి అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో గ్రామీణ భారతదేశంలో భూస్వామ్య వర్గాల దోపిడీ బలంగా కొనసాగుతున్నది. నక్సల్బరి ఉద్యమం, శ్రీకాకుళ ఉద్యమం వంటి రైతాంగ పోరాటాలు దేశవ్యాప్తంగా ప్రభావాన్ని చూపుతున్నాయి. సిపిఐ, సిపిఎంవిధానాలతో విసుగుచెందిన అనేకమంది విప్లవకారులు దీర్ఘకాలిక సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుని భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను కొనసాగిస్తున్న కాలం అది. ఆ ఉద్యమాల ప్రభావం రైతులు, విద్యార్థులు, యువతపైనే కాకుండా రచయితలు, కవులు, కళాకారులపైనా పడింది. అనేకమంది సాహిత్యకారులు ఆ ఉద్యమాల లక్ష్యాలతో మమేకమై తమ రచనలను ప్రజా పోరాటాలతో అనుసంధానించారు. ఆ చారిత్రక పరిస్థితుల్లో విరసం ఆవిర్భావం ఒక నిర్దిష్ట సామాజిక అవసరానికి ప్రతిస్పందనగా జరిగింది. ఆ కాలంలోని పరిస్థితుల్లో, దానిలో ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ, విరసం సాహిత్య సాంస్కృతిక రంగంలో పోషించిన పాత్రను తక్కువ చేసి చూడలేం.

కానీ ఒక ఉద్యమం తన పుట్టుకకు కారణమైన పరిస్థితులను దాటి ముందుకు సాగాలంటే మారుతున్న వాస్తవాలను నిరంతరం అధ్యయనం చేసుకోవాలి. గత ఐదు దశాబ్దాలలో భారతదేశ ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక పరిస్థితుల్లో విపరీతమైన మార్పులు వచ్చాయి. భూస్వామ్య దోపిడీ రూపాలు మారాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత విస్తరించింది. గుత్త పెట్టుబడి (కార్పొరేట్ )మూలధనం బలపడింది. కుల సంబంధాలు కొత్త రూపాల్లో కొన సాగుతున్నాయి. దళిత బహుజన ఆదివాసీ మహిళా ఉద్యమాలు తమ స్వతంత్ర ప్రశ్నలను ముందుకు తెచ్చాయి. అదే సమయంలో డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థ, డేటా క్యాపిటలిజం, ప్లాట్‌ఫాం ఎకానమీ, గిగ్ లేబర్, కృత్రిమ మేధస్సు వంటి కొత్త వాస్తవాలు శ్రమ స్వభావాన్నే మార్చుతున్నాయి. ఈ పరిణామాలను సమగ్రంగా అధ్యయనం చేసి సాహిత్య సాంస్కృతిక రంగంలో కొత్త ప్రశ్నలను ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కానీ విరసం ఇప్పటికీ అనేక సందర్భాల్లో 1970ల నాటి రాజకీయ పదజాలాన్నే పునరావృతం చేస్తూ కనిపించడం దాని ముందున్న ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు.

ప్రజలను సోషలిస్టు విప్లవ లక్ష్యాలతో చైతన్యవంతం చేయాలని భావించే ఒక సాహిత్య సంస్థకు మార్క్సిజం ఒక మార్గదర్శక దృక్పథంగా ఉండవచ్చు. కానీ సంఘాన్ని నిర్మించేటప్పుడు మరింత విశాలమైన ప్రజాస్వామిక దృక్పథం అవసరం. పెట్టుబడిదారీ రాజ్యానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా పెట్టుబడిదారీ సంస్కృతికి, భూస్వామ్య సంస్కృతికి, కుల వివక్షకు, పితృస్వామ్య విలువలకు, అన్ని రకాల దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజా సంస్కృతిని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. సంఘంలో పనిచేసే ప్రతి రచయిత తప్పనిసరిగా ఒకే సైద్ధాంతిక నిబంధనకు లోబడి ఉండాలన్నదానికంటే, ఈ దేశంలో దోపిడీకి అణచివేతకు వివక్షకు గురవుతున్న ప్రజల సమానత్వం ప్రజాస్వామ్యం కోసం పనిచేసే రచయితలను విస్తృతంగా సంఘటితం చేయడం అవసరం. వారి రాజకీయ లేదా సైద్ధాంతిక అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ సమానత్వం ప్రజాస్వామ్యం ప్రజా సంస్కృతి



అనే ఉమ్మడి ప్రాతిపదికపై కలిసి పనిచేయగల అవకాశం ఉండాలి. ఇది రాజ్యాంగబద్ధమైన సుదీర్ఘమైన సాంస్కృతిక ప్రక్రియగా కొనసాగించవలసి ఉంటుంది.

దీర్ఘకాలిక సాయుధ పోరాటం లేదా ప్రజాయుద్ధం అనే నిర్దిష్ట రాజకీయ మార్గాన్ని ఒక సాహిత్య సంస్థగా విరసం నిరంతరం సమర్థించడం దాని సాంస్కృతిక పరిధిని విస్తరించడానికి కాకుండా పరిమితం చేయడానికి కారణమవుతుంది. వ్యక్తులుగా ఎవరి రాజకీయ విశ్వాసాలు ఏవైనా కావచ్చు. కానీ ఒక సాహిత్య సంస్థను ఒక నిర్దిష్ట సాయుధ రాజకీయ మార్గానికి కట్టిపడేయడం వల్ల ఆ సంస్థ ప్రజల విస్తృత ప్రజాస్వామిక సాంస్కృతిక వేదికగా ఎదగకుండా ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది. 1970ల పరిస్థితుల్లో ఒక నిర్దిష్ట రాజకీయ మార్గంతో సాహిత్యకారులు మమేకం కావడానికి ఉన్న చారిత్రక కారణాలను అర్థం చేసుకోవాలి. అదే కారణాలతో నేటి పరిస్థితులను కూడా చూడటం మాత్రం శాస్త్రీయమైన చారిత్రక పరిశీలన కాదు. కాలం మారినప్పుడు విధానాలను పునఃపరిశీలించడం బలహీనత కాదు. మారిన వాస్తవాలను గుర్తించి కొత్త మార్గాలను అన్వేషించగల సామర్థ్యమే ఒక సజీవమైన ఉద్యమానికి గుర్తు.

కుల సమస్య విషయంలో కూడా విరసం తన గత అనుభవాలను లోతుగా సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. భారతదేశంలోని నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను, కుల అణచివేతను, వివక్షను ఎదుర్కొనే విషయంలో దళితులు, బహుజనులు, ఆదివాసీలు, మహిళా ఉద్యమాల నుంచి దశాబ్దాలుగా వచ్చిన విమర్శలను సీరియస్‌గా స్వీకరించాల్సి ఉంది. సమానత్వ సంస్కృతిని నిర్మించాలనుకునే సాహిత్య సంస్థ కుల ప్రశ్నను కేవలం వర్గ ప్రశ్నలో భాగంగా చూడటం దగ్గర ఆగిపోకుండా, కుల ఆధిపత్యం ప్రజల జీవితాల్లో ఎలా పనిచేస్తుందో దాని ప్రత్యేకతతో అర్థం చేసుకోవాలి. దళిత బహుజన మేధావులతో సృజనాత్మక సంభాషణ జరపడం, వారి అనుభవాలను సాహిత్య సాంస్కృతిక ఉద్యమంలో భాగం చేయడం, కొత్త తరాల రచయితలను ఆకర్షించడం విరసం ముందున్న ముఖ్యమైన అవసరాల్లో ఒకటి.

అయితే ఈ విమర్శల కారణంగా విరసం చారిత్రక పాత్రను పూర్తిగా కొట్టిపారేయడం సరైంది కాదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీ, అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా సాహిత్య సాంస్కృతిక రంగంలో విరసం పోషించిన పాత్ర గణనీయమైనది. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసినవారు, త్యాగాలు చేసినవారు ఆ సంస్థలో అనేకమంది ఉన్నారు. గొప్ప రచయితలను, కవులను, కళాకారులను అభివృద్ధి చేసిన చరిత్ర కూడా విరసానికి ఉంది. ఆ చరిత్రను గుర్తించడం అంటే దాని లోపాలను విస్మరించడం కాదు. అలాగే దాని లోపాలను విమర్శించడం అంటే దాని చారిత్రక సేవలను నిరాకరించడం కూడా కాదు.

ఇప్పటి ప్రశ్న విరసం ఉండాలా వద్దా అనేది మాత్రమే కాదు. తన చారిత్రక అనుభవాన్ని సమీక్షించుకుని కొత్త పరిస్థితులకు తగిన కొత్త పాత్రను పోషించగలదా అన్నదే అసలు ప్రశ్న.

గతాన్ని సమర్థించుకోవడం కంటే గతాన్ని పరిశీలించుకోవడం అవసరం. విమర్శలను శత్రుదాడిగా భావించి ప్రతిదాడి చేయడం కంటే వాటిలోని వాస్తవాన్ని గుర్తించడం అవసరం. సమాజంలో వస్తున్న కొత్త మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, తన రాజకీయ సాంస్కృతిక విధానాలను పునరాలోచించి, సమానత్వం ప్రజాస్వామ్యం ప్రజా సంస్కృతి కోసం విస్తృతమైన రచయితల వేదికగా తనను తాను పునర్నిర్మించుకోగలిగితే విరసం తన చరిత్రకు కొత్త కొనసాగింపును ఇవ్వగలదు. 56 సంవత్సరాల తర్వాత విరసం ముందున్న నిజమైన సవాలు ఇదే.

( గమనిక : ఈ వ్యాసం పరిమితమైన , సంక్షిప్తమైన విషయాలకు మాత్రమే పరిమితమైంది. )

విశాల్

21 సెప్టెంబర్, 2026

# 12 ఏళ్ళ బీజేపీ పాలనలో ప్రశ్నలు అనేకం - మోదీ మౌనం



2014 నుంచి బీజేపీ ప్రభుత్వం తరపున భారత ప్రజలకు అభివృద్ధి, దేశభక్తి, త్యాగం, క్రమశిక్షణ పేరుతో ఎన్నో పిలుపులు వచ్చాయి. పెద్ద నోట్ల రద్దు నుంచి కొవిడ్ దీపాల వరకు, వ్యవసాయ చట్టాల నుంచి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రజలు ప్రభుత్వ నిర్ణయాల భారాన్ని మోశారు. కానీ ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న "ప్రజలు ప్రభుత్వం చెప్పింది చేశారా?" అనేది కాదు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏమి నెరవేర్చింది? ఎవరి జీవితాలు మెరుగుపడ్డాయి? ఎవరి మీద భారాలు పెరిగాయి? లాభాలు ఎవరికి వచ్చాయి, నష్టాలు ఎవరు భరించారు?" అనేదే ప్రధాన ప్రశ్నలు. ఈ ప్రశ్నలను శ్రమజీవి, రైతు, చిన్న వ్యాపారి, ఉద్యోగార్థి, మధ్యతరగతి కుటుంబం అనే ప్రజా దృక్కోణంలో చూస్తే 2014 తర్వాతి పాలనపై మరింత కఠినమైన లెక్కలు అడగాల్సి వస్తుంది.

మొదట నోట్ల రద్దు. 2016 నవంబర్ 8న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధులపై దెబ్బగా ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించింది. కానీ రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం రద్దయిన నోట్లలో రూ.15.31 లక్షల కోట్ల విలువైన నోట్లు తిరిగి వచ్చాయి. అంటే రద్దయిన కరెన్సీలో దాదాపు 99.3 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చింది. అదే సమయంలో రిజర్వ్ బ్యాంక్ 2017-18లో నోట్ల ముద్రణ, భద్రతా ముద్రణ తదితర ప్రక్రియలపై భారీ వనరులు వినియోగించాల్సి వచ్చిందని తెలిపింది.నోట్ల రద్దు వల్ల పన్ను అనుసరణ, డిజిటల్ చెల్లింపులు వంటి కొన్ని మార్పులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, "నల్లధనం నిర్మూలన" అనేది అసలు సమస్యగా చెప్పిన బీజేపీ అది ఆచరణలో జరగలేదు. నోట్ల రద్దు అనేది కేవలం ప్రచార ఆర్భాటంగా మిగిలింది,ఫలితంగా సామాన్య ప్రజలు నానా అగచాట్లు పడ్డారు తప్ప నోట్లరద్దు వల్ల ఏం మేలు జరిగిందో ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రజలకు స్పష్టమైన జవాబు చెప్పలేదు.బడా బాబులు డబ్బుకోసం బ్యాంకుల ముందు ఎవరూ క్యూలో నిలబడలేదు.కొత్త నోట్ల ప్రింటింగ్ ఖర్చు కేంద్ర ప్రభుత్వానికి అదనపు భారం అయింది. ఈ కొత్త నోట్లు ప్రింటింగ్ ప్రెస్ నుంచి ధనికుల ఇళ్ళకు నేరుగా లారీల కొద్ది నోట్ల కట్టలు సేఫ్ గా చేరాయి.

జీఎస్టీని "గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్"గా పరిచయం చేశారు. కానీ పన్ను సంస్కరణ ప్రయోజనాలను అంచనా వేయాలంటే పెద్ద కార్పొరేట్ సంస్థల దృష్టితో మాత్రమే చూడటం సరిపోదు. చిన్న దుకాణదారు, స్వయం ఉపాధి కార్మికుడు, చిన్న తయారీదారు, సేవా రంగంలోని సూక్ష్మ సంస్థపై అనుసరణ ఖర్చు ఎంత పడింది? వారి వ్యాపారం, ఆదాయం, ఉద్యోగాలపై ప్రభావం ఏమిటి? ఇవే ప్రజా ఆర్థిక దృష్టిలో కీలక ప్రశ్నలు. జీఎస్టీ ద్వారా పన్ను వ్యవస్థలో మార్పులు వచ్చినా, పన్ను సేకరణ పెరగడం మాత్రమే ప్రజల జీవన ప్రమాణం పెరిగిందనడానికి ప్రమాణం కాదు.ఉద్యోగాల విషయంలో మరింత తీవ్రమైన ప్రశ్న ఉంది. "ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు" అనే ఎన్నికల హామీ రాజకీయ చర్చలో విస్తృతంగా నిలిచింది.బీజేపీ వాగ్ధానం మేరకు ఈ 12ఏళ్ళ కాలం 24 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాల్సింది.కానీ ఇదొక బూటకపు ప్రకటనగా దేశ చరిత్రలో నిలిచింది. తాజా ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2025లో 15--29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 9.9 శాతం; పట్టణ యువతలో అది 13.6 శాతం. 2025లో 15 ఏళ్లు పైబడిన విద్యావంతుల నిరుద్యోగిత కూడా 6.5 శాతంగా నమోదైంది. మరోవైపు 2025లో స్వయం ఉపాధి వాటా 56.2 శాతంగా ఉంది. అంటే "ఉద్యోగం" అనే పదం వెనుక స్వయం ఉపాధి, అసంఘటిత పని, స్థిర వేతన ఉద్యోగం మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. ప్రజలకు కావాల్సింది కేవలం ఉపాధి సంఖ్య కాదు; స్థిరమైన ఉద్యోగం, గౌరవప్రదమైన వేతనం, సామాజిక భద్రత.రైతుల విషయంలో 2020లో మూడు వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి, ఏడాది పాటు జరిగిన తీవ్ర ఉద్యమం తరువాత 2021లో వాటిని రద్దు చేయాల్సి వచ్చింది. రైతు ఉద్యమ సమయంలో మరణించిన వారి సంఖ్యపై ప్రభుత్వం అధికారిక గణాంకం లేదని పార్లమెంటుకు తెలిపింది; అదే సమయంలో రైతు సంఘాలు 700కు పైగా మరణాలను ప్రస్తావించాయి.ఇప్పటికీ రైతు ఆత్మహత్యల సమస్య మాత్రం ఉద్యమానికి అతీతంగా కొనసాగుతోంది. అధికారిక పార్లమెంటరీ గణాంకాల ప్రకారం 2019లో 5,957 మంది రైతులు/ సాగుదారుల ఆత్మహత్యలు నమోదైతే, 2020లో 5,579, 2021లో 5,318 నమోదయ్యాయి. వ్యవసాయ సంస్కరణల చర్చలో రైతు ఆదాయం, కనీస మద్దతు ధర, రుణభారం, మార్కెట్ శక్తి, ఇన్‌పుట్ ఖర్చులు ప్రధాన స్థానంలో ఉండాలి.కానీ రైతు బ్రతుకులు బీజేపీ పాలనలో ఛిద్రం అయ్యాయి.ఇంధన ధరలు సామాన్యుడి జీవితంపై పడే పరోక్ష పన్నుల్లాంటివి. పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలో లేవు; కేంద్ర సుంకాలు, రాష్ట్రాల వ్యాట్ రెండూ ధరలో భాగం. 2026 సెప్టెంబర్ నాటికి కేంద్రం పెట్రోల్‌పై వివిధ రూపాల్లో లీటరుకు సుంకాలు విధిస్తుండగా, రాష్ట్రాల మధ్య వ్యాట్ రేట్లు గణనీయంగా మారుతున్నాయి. తెలంగాణలో పెట్రోల్‌పై 35.20 శాతం, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ ఉందని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ చూపిస్తోంది. కాబట్టి ధరల బాధ్యతను పూర్తిగా కేంద్రానికో, రాష్ట్రాలపైకో నెట్టేయడం కాకుండా కేంద్రం--రాష్ట్రాల పన్నుల మొత్తం భారాన్ని ప్రజల ముందుంచాలి.బీజేపీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు సాగిలపడటం మూలంగా ,వెనుజులా , రష్యా, ఇరాన్ నుండి కారుచౌకగా మనం ఇంధన వనరులను సమకూర్చుకోలేక పోయాము. మన దౌత్యం ఈ విషయంలో పూర్తిగా విఫలం అయింది. చైనా అమెరికా ఆంక్షలను ఎదిరించింది.తన దేశ ఇంధన వనరులను సజావుగా పొందుతుంది. మోదీ ప్రభుత్వానికి ట్రంప్ ను ఎదిరించే దమ్మూ, ధైర్యం లేకపోయింది.మోదీ మొఖాన ఎన్ని సార్లు ట్రంప్ అవమాన పరుస్తూ,ఈసడింపుగా మాట్లాడాడో లెక్క లేదు. భారత దేశ చరిత్రలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ భారత ప్రధానమంత్రి కి ఇంత అవమానం ఎన్నడూ జరగలేదు. గత భారత దేశ ప్రధాన మంత్రులు ఎవరూ ఇంత అవమానాన్ని భరించలేదు.అయినా అమెరికా అధ్యక్షుడు ప్లాంటుకు ఘాటుగా సమాధానం ఇవ్వకుండా మోదీ మోనౌం పాటించారు.కొవిడ్ సమయంలో చప్పట్లు, పళ్లెం శబ్దాలు, దీపాల కార్యక్రమాలు ఆరోగ్య కార్యకర్తలకు సంఘీభావ సూచికలుగా అశాస్త్రీయ ఆదేశాలు ఇచ్చారు. మోదీకి ప్రచారం, ప్రదర్శనలు ఇవ్వడం ఇష్టం. ప్రజలు కూడా గుడ్డిగా మోదీ మాటలు నమ్మారు. కానీ కోవిడ్ మహమ్మారి రెండో దశలో ఆక్సిజన్, ఆసుపత్రి పడకలు, వైద్య మౌలిక వసతుల కొరత దేశాన్ని తీవ్రంగా కుదిపేసింది.శవాలు వేలసంఖ్యలో గంగా నదిలో తేలాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 5 కోట్ల మందికి పైగా చనిపోయారు. వాస్తవానికి ఈ మరణాలు అనేక రెట్లు అధికంగా ఉన్నాయి అని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ తేల్చింది. ప్రజాస్వామ్య సమాజంలో సంక్షోభ సమయంలో ప్రతీకాత్మక ఐక్యతతో పాటు ప్రాణాలను కాపాడే ప్రజారోగ్య మౌలిక వసతులే ప్రభుత్వ పనితీరుకు అసలు కొలమానం. కానీ నేటికీ ఈ విషయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల సంగతి తెలిసిందే. ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నగ్న దోపిడీ తెలిసిందే. దేశంలో ఫార్మా కంపెనీల డ్రగ్ మాఫియా సంగతి ప్రజల అనుభవంలో ఉన్నదే.ఎన్నికల బాండ్ల వ్యవహారం ప్రజాస్వామ్యంలో డబ్బు--అధికారం సంబంధాన్ని మరింత స్పష్టంగా ముందుకు తెచ్చింది. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తూ, రాజకీయ పార్టీల నిధులపై సమాచారాన్ని ప్రజలకు దాచడం సమాచార హక్కుకు విరుద్ధమని పేర్కొంది. కంపెనీలకు అపరిమిత రాజకీయ విరాళాలకు అనుమతినిచ్చిన మార్పులను కూడా కోర్టు కొట్టివేసింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారంపై ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 2017-18 నుంచి 2022-23 వరకు బాండ్ల ద్వారా వచ్చిన విరాళాల్లో బీజేపీకి రూ.6,565.98 కోట్లు, అంటే 54.77 శాతం లభించాయి. ఇక్కడ ప్రశ్న ఒక పార్టీకి వ్యతిరేకంగా కాదు; రాజకీయ అధికారం--కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు కార్పొరేట్ డబ్బు మధ్య సంబంధం ఓటరుకు పూర్తిగా కనిపించాలా లేదా? ఇప్పటికీ ప్రపంచంలో ఏ దేశంలో, ఏ పార్టీ కి ఇంత మూలధనం బీజేపీకి లభించినంతగా ఎవరికీ లభించలేదు.సుప్రీం కోర్టు తప్పు పట్టినా...మరో పేరుతో ఈ సరఫరా నేటికీ కొనసాగుతుంది.

మణిపూర్ విషయంలో 2023లో హింస ప్రారంభమైన తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం 2023 ఆగస్టు నాటికి 152 మంది మరణించారు, 1,106 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, దాదాపు 14,898 మందిని అరెస్టు చేశారు. హింసకు కారణాలు, అధికారుల వైఫల్యాలు పరిశీలించేందుకు కేంద్రం విచారణ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయినప్పటికీ బాధితుల పునరావాసం, న్యాయం, శాశ్వత శాంతి వంటి చర్యలు తీసుకోలేదు. నేటికీ మణిపూర్ రావణాసురుని కాష్టంలా రగులుతూనే ఉంది. చివరగా మీడియా. అధికారాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రాథమిక బాధ్యత. కానీ ప్రభుత్వ అనుకూలమైనా మీడియా గోదీ మీడియాగా ప్రసిద్ధి పొందింది.అవి మోదీ భజన మండళ్లుగా మారాయి. ప్రతిపక్ష అనుకూలమైనా జర్నలిజంపై ఆంక్షలు పెరిగాయి.భారత మీడియా స్వేచ్ఛా పై ప్రపంచ స్థాయి ఇండెక్స్ లో 157 స్థానానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ లెక్కలు, ఆర్థిక ఆధారాలను ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నమ్మే పరిస్థితి లేదు. దేశ ఆర్థిక పరిస్థితి వాస్తవాలు,146 కోట్ల ప్రజల్లో సామాన్య ప్రజా నిత్య జీవన స్థాయి అనే ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది.అదానీ, అంబానీ లాంటి కొద్ది మంది ప్రపంచ స్థాయి సంపన్నుల స్థాయికి చేరుకుంటే అది ఆర్థిక ప్రగతి అని చెప్పలేము. అదే సమయంలో అధికారాన్ని ప్రశ్నించే స్వరాలను, మీడియాపై ఆంక్షలు రుద్దటం, జర్నలిస్ట్ లు, సంపాదకులపై కేసులు పెట్టి జైళ్ళ పాలు చేశారు . కోర్టులు అవి ఆధారాలు లేనివిధంగా తేల్చాయి. భారత్ లో దేశభక్తి--దేశద్రోహం అనే ద్వంద్వంలో మీడియా స్వేచ్చను బంధించడం ప్రజాస్వామ్య చర్చను కుదిస్తుంది.భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి జీడీపీ వృద్ధి గణాంకాలు చెప్పే కథ ఒకటి; కుటుంబాల జీవన వ్యయం, ఉపాధి, వేతనాలు, రైతు ఆదాయం చెప్పే కథ మరొకటి. 2023-24 కుటుంబ వినియోగ వ్యయ సర్వేలో గ్రామీణ వినియోగ అసమానత గణాంకాలలో 0.237, పట్టణ ప్రాంతంలో 0.284గా నమోదైంది. ఈ గణాంకాలు అసమానత తగ్గిందనే అధికారిక సూచన ఆచరణలో కనపడటం లేదు 80 కోట్ల మంది ప్రజలు సబ్సిడీ ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నారు. అందుకే ప్రతి బడ్జెట్‌లో, ప్రతి ఎన్నికలో, ప్రతి పెద్ద విధాన నిర్ణయంలో ప్రజల లెక్క అడగాల్సిన ప్రశ్న ఒక్కటే: ఆర్థిక వృద్ధి ఫలాలు ఎవరికి చేరాయి? శ్రమించిన ప్రజలకు ఎంత దక్కింది? కార్పొరేట్ రంగానికి ఎంత లాభం వచ్చింది? రైతు, కార్మికుడు, చిన్న వ్యాపారి, నిరుద్యోగ యువత, మధ్యతరగతి కుటుంబం ఎంత భారం మోశాయి?ప్రజలు దేశం కోసం త్యాగం చేయాలని ప్రభుత్వాలు అడగడం కొత్త కాదు. కానీ ప్రజాస్వామ్యంలో త్యాగం చేయాల్సింది ఎప్పుడూ ప్రజలే, లాభం పొందేది ఎప్పుడూ గద్దెనెక్కిన కొద్దిమందే అనే భావనకు తావు ఉండకూడదు. ప్రజల నుంచి విధేయతను కోరే రాజకీయానికి బదులు, ప్రజల ముందు ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ లెక్క చెప్పే పారదర్శక పాలన అవసరం.కోవిడ్ సమయంలో మోదీ పిలుపును ఆవేశంగా గుడ్డిగా నమ్మకంతో పళ్లెలు, చప్పట్లు కొట్టిన చేతులు ఇప్పుడు గణాంకాల చిట్టా విప్పమని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి అడుగుతున్నాయి. దీపాలు వెలిగించిన అంధ భక్తులే ఇప్పుడు లెక్కల పుస్తకం తెరవమంటున్నాయి. "ప్రజలు కేవలం ఓట్లు వేసే భక్తులు మాత్రమే కాదు--- ఈ యువతరం నవ పౌరులు చప్పట్లు కొట్టడానికే కాదు, అధికారాన్ని నిలబెట్టి ప్రశ్నించడానికి జన్-జీ, ఆల్ఫా-జీ కూడా సిద్ధంగా ఉన్నారు."

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్

సెల్ : 98493 28496

# ఈనెల 24న డీసీఐవీ తొలి ఆవిర్భావ సభ

## కరపత్రం ఆవిష్కరించిన వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రి

జన నిర్ణయం / వరంగల్ (సెప్టెంబర్ 21) :



ఈ నెల 24న వరంగల్ జిల్లా కేంద్రంలోని పోచమ్మైదాన్ రత్న హోటల్ ఎదురుగా ఉన్న కార్మిక శాఖ గ్రౌండ్‌లో నిర్వహించనున్న దళిత క్రైస్తవ ఐక్యవేదిక (డీసీఐవీ) తొలి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్‌లో ఆవిష్కరించారు.

# సంగెంలో అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ వేడుకలు

జన నిర్ణయం / సంగెం (సెప్టెంబర్ 21) :

తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (రిజి. నం.



1033/77) 50వ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంగెం మండల కేంద్రంలో సోమవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు మెట్టుపల్లి సునీల్ జెండాను ఆవిష్కరించారు.

# గోరికొత్తపల్లిలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

జననిర్ణయం /గోరి కొత్తపల్లి (సెప్టెంబర్ 21)



గోరికొత్తపల్లి గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ పర్యవేక్షణ లోపంతో విద్యుత్ వృథా అవుతోందని ఆరోపిస్తున్నారు. విద్యుత్ పొదుపుపై సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. పగటిపూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామపంచాయతీ ఆదాయాన్ని పొదుపుగా వినియోగించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

.

# జూరాల వద్ద హైటెన్షన్.. భారీగా పోలీసుల మోహరింపు

మహబూబ్ నగర్ సెప్టెంబర్ 21,

సోమవారం నాడు జూరాల ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో భారీగా పోలీసులు మోహరించారు. రైతుల ఆందోళనలకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో 12 కిలోమీటర్ల పరిధిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాగునీటి సమస్యలపై గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం అరెస్ట్ చేయిస్తోందని పార్టీ ఆరోపించింది. జూరాల నుంచి నీళ్లు ఇవ్వడం లేదంటూ ధర్నాకు రైతులు సిద్ధమయ్యారు. దీంతో ప్రాజెక్టుకు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

# కాళేశ్వరం ఆశ్రమ బాలికల పాఠశాల వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

## సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన : ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి బందు సుజాత

జన నిర్ణయం / మహాదేవపూర్ (సెప్టెంబర్ 21) :

కాళేశ్వరం ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి బందు సుజాత డిమాండ్ చేశారు. పాఠశాలను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 200 మంది విద్యార్థులకు కేవలం నాలుగు మరుగుదొడ్లు మాత్రమే పనిచేస్తున్నాయని, బాలికల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.




# ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సూపరింటెండెంట్ ధర్మరాజుకు సన్మానం



జన నిర్ణయం / వరంగల్ (సెప్టెంబర్ 21) :

వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ధర్మరాజును ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్, వెలాసిటీ నాగేందర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మరాజుకు శాలువా, బొకేతో సత్కారం చేశారు.

# గణేష్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి : గోరికొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి



జననిర్ణయం /గోరికొత్తపల్లి (సెప్టెంబర్ 21)

గణేష్ నిమజ్జనాల సమయంలో సమయపాలన పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గోరికొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి సూచించారు. నిమజ్జన ఊరేగింపుల్లో డిజేలు, అధిక శబ్దం చేసే సౌండ్ బాక్సులు వినియోగించరాదన్నారు.

చిన్నారులను నీటి ప్రాంతాలకు దూరంగా ఉంచాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డిజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ బాక్సులు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరిక

జన నిర్ణయం / దామెర (సెప్టెంబర్ 21) :

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరుతునట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దుర్గం పేట గ్రామానికి చెందిన సలేంద్ర వేదమాచారి, సలేంద్ర పున్నమా చారిలు, హనుమకొండలో భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేవూరి ప్రకాష్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ముందుగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబాసి రాజేందర్, దుర్గంపేట సర్పంచ్ దాసి శ్రీకాంత్, దుర్గంపేట



మాజీ సర్పంచ్ కాంగ్రెస్ క్లస్టర్ ఇంచార్జి కూనమల్ల రవీందర్, శనిగరం సుధాకర్, పాల్గొన్నారు.

# వరంగల్ డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల శ్రీహరి



జన నిర్ణయం / వరంగల్ (సెప్టెంబర్ 21) :

వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు తెలంగాణకు చెందిన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ నరసింహారావు) పేరు పెట్టాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల శ్రీహరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వరంగల్ ప్రాంత అభివృద్ధిలో విమానాశ్రయం కీలక పాత్ర పోషించగలదని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, వాణిజ్యం, విద్య, వైద్యం, పర్యాటకం, ఉపాధి వంటి రంగాలకు విమానాశ్రయం మరింత ఊతమివ్వగలదన్నారు.

పీవీ నరసింహారావు 1991 జూన్ 21 నుంచి 1996 మే 16 వరకు భారత ప్రధానమంత్రిగా పనిచేశారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో విదేశాంగ, హోం, రక్షణ, మానవ వనరుల అభివృద్ధి తదితర శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు సంబంధించిన చర్యలు చేపట్టబడ్డాయని కేంద్ర ప్రభుత్వ అధికారిక రికార్డులు పేర్కొంటున్నాయి. “తెలంగాణ నేల నుంచి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన పీవీ నరసింహారావు సేవలకు గుర్తింపుగా వరంగల్ విమానాశ్రయానికి ‘శ్రీ పీవీ నరసింహారావు డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్’గా పేరు పెట్టడం సముచిత గౌరవం” అని రాజనాల శ్రీహరి అన్నారు. పీవీ నరసింహారావు అందించిన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తు చేసే విధంగా విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని ఆయన కోరారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జిగా సొప్పరి సంతోష్ కుమార్

కమాన్ పూర్, సెప్టెంబర్ 21, కమాన్ పూర్ మండలంలోని వార్డు సభ్యుల ఫోరం మండల ఇంచార్జిగా జూలపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు సొప్పరి సంతోష్ కుమార్ ను వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు నియమించినట్లు పెద్దపల్లి జిల్లా వార్డు సభ్యుల ఫారం ఇంచార్జి తప్పట్ల మోహన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సొప్పరి సంతోష్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని వార్డుల్లో నెలకున్న సమస్యలు – వాటి పరిష్కారం దిశగా ముందు ఉండేది వార్డు సభ్యులు మాత్రమే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వార్డుల్లో సమస్యలు పరిష్కారం అయితేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. వార్డుల స్థాయి నుండే గ్రామం.. మండలం.. జిల్లా.. రాష్ట్రం.. దేశం.. ఇలా ప్రగతి పథంలో ముందుకు సాగుతేనే.. దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. పల్లెల ప్రగతిలో వార్డు సభ్యుల పాత్ర క్రియాశీలకమన్నారు. తన పై ఎంతో నమ్మకంతో కమాన్ పూర్ మండల వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జిగా అపోగించిన బాధ్యతలకు న్యాయం చేసే విధంగా.. వార్డు సభ్యులకు గౌరవమైన హోదా.. హక్కుల సాధన కోసం కృషి చేస్తానని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనారోగ్యంతో యువకుడి మృతి

జన నిర్ణయం రేగొండ, మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి అఖిల్ (20) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అఖిల్ గ్రామంలోనే డీజే టెంట్‌హౌస్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.

ఈ క్రమంలో సుమారు 20 రోజుల క్రితం అఖిల్ కళ్లు తిరిగి ఒక్కసారిగా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అఖిల్‌కు సోమవారం ఉదయం గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్టిపుల్ ఆర్గాన్ డ్యామేజ్ కారణంగా అఖిల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు. మృతుడికి తల్లి దండ్రులు పద్మ అయిలుస్వామి ఉండగా ఒక సోదరుడు నాగరాజు ఉన్నారు..



చిన్న వయసులోనే అఖిల్ మృతి చెందడంతో తిరుమలగిరి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# మద్యపాన నిషేధంపై అక్టోబర్ 2 కలెక్టరేట్ ముట్టడి

జన నిర్ణయం / ఎల్కతుర్తి (సెప్టెంబర్ 21) :

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్. ఎంఎస్పి. ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించిన రూ. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా ఇంచార్జ్ ఏ ఊరి వెంకటేశ్వర్ రావు మాదిగ. సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ హాజరై మాట్లాడుతూ. మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2 నా నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చినారు. మద్యపానం నిషేధంతో అనేక కుటుంబాలు. ఆర్థికంగా. ఆరోగ్యరీత్యా. మానసికంగా నష్టపోతున్నారు. అప్పుల పాలై ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ముఖ్యంగా యువత మద్యం వైపు ఆకర్షితులై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు సమయపాలన లేకుండా నడవడం వలన మద్యం అందుబాటులో ఉండి మద్యానికి బానిసలవుతున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు వెంటనే మూసివేయాలి. ఆబ్కారి అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం వలన బెల్టు షాపులు విచ్చలవిడిగా గ్రామాల్లో నడుపుతున్నారు. బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్టోబర్ 7 నా చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్. ఎన్ఎస్పి నూతనంగా ఎన్నికైన పంపి సభ్యులు. నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చిన రూ. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఫోరం నాయకులు. బొంకూరి వంశీ మాదిగ. ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ. అల్లకుండా బాలు మాదిగ. ఎమ్మార్పీఎస్. ఎన్ఎస్పి నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపావి చెత్త ఆరోపణలు మంత్రి నారాయణ

నెల్లూరు సెప్టెంబర్ 21,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు తనపై చేసేవి చెత్త ఆరోపణలని ధ్వజమెత్తారు. నెల్లూరు జిల్లాలోని దొంతాలి లెగసీ వేస్ట్ ప్లాంటును మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 153 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌లో ఇప్పటికే 143 లక్షల టన్నుల చెత్తను తొలగించామని,మిగిలిన చెత్తను కూడా త్వరితగతిన క్లియర్ చేస్తామని,రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల పనులు కొనసాగుతున్నాయి. మరో ఆరు చిజీబబివ–బినీ–ఇనివతీణఎ ప్లాంట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి అనుమతించారని,దొంతాళి ప్లాంట్ పూర్తయితే 100 కి.మీ. పరిధిలోని చెత్తను రోజువారీగా ప్రాసెస్ చేసి విద్యుత్‌గా మారుస్తామని,చెత్తను సమస్యగా కాకుండా వనరుగా మార్చి.. ప్రజారోగ్యానికి భరోసా కల్పించే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం అని తెలిపారు. చెత్తని కాలుస్తున్నారని వైసీపీ నేతలు అవివేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చదువుకున్న వారు కూడా అజ్ఞానంతో మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. చెత్తకుప్పలో బయోగ్యాస్ తయారై మంటలు వస్తాయని తెలిపారు. మిథైన్ 65 శాతం ఉండటంతో ఈ చెత్త తగలపడుతోందని చెప్పుకొచ్చారు.

JANA NIRNAYAM TELUGU DAILY
జన నిర్ణయం
తెలుగు దినపత్రిక



## మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

హైదరాబాద్ సెప్టెంబర్ 21,

మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి చెందాడు. మూసారాంబాగ్ శాలివాహన నగర్ లో ఘటన జరిగింది. కానిస్టేబుల్ ముత్తె చంద్రశేఖర్ (35) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. అంబర్పేట్ హెడ్ క్వా ర్టర్స్ లో కానిస్టేబుల్ రైటర్ విధులు నిర్వహిస్తు?న్నాడు. అర్ధరాత్రి ఓ యువతికి వీడియో కాల్ చేసినట్లు సమాచారం. తాను ఉరేసుకుంటున్నట్లు యువతికి చెప్పినట్లు సమాచారం. వెంటనే యువతి చైతన్యపురి పోలీసులకు సమాచారం అందించింది. చైతన్యపురి పోలీసుల సమాచారంతో మలక్ పే ట్ పోలీసులకు విషయం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కానిస్టేబుల్ మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

====================

## మాజీ ఉప సభాపతి రఘుపతి అరెస్టు

బాపట్ల సెప్టెంబర్ 21,

విజయవాడలో డీఎస్సీ అక్రమాలపై నిరసన తెలపడానికి వెళ్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ని పోలీసులు అరెస్ట్ చేసారు. డీఎస్సీ స్పోర్ట్స్ నియామకాల్లో అక్రమాల్ని ప్రశ్నిస్తూ శాప్ కార్యాలయం వద్ద ఈరోజు వైయస్ఆర్సీపీ భారీ నిరసనకి పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పాల్గొనడానికి వెళ్తున్న రఘుపతి ని బాపట్ల మండలం చుండూరుపల్లి వద్ద అరెస్టు చేసిన పోలీసులు, తరువాత బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్కి తరలించారు.

## రెడ్ సర్కిల్ వద్ద భారీగా పోలీసులు మొహరింపు

విజయవాడ సెప్టెంబర్ 21,

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అవకతవకల్ని ప్రశ్నిస్తూ.. సోమవారం శాప్ కార్యాలయం వద్ద నిరసనకి వైయస్ఆర్సీపీ పిలుపునిచ్చింది. ఈ నేపధ్యంలో భారీగా విజయవాడకి వైయస్ఆర్సీపీ శ్రేణులు చేరుకోవడంతో.. పోలీసులు బారికేడ్లు పెట్టి వాహనాల్ని నిలిపివేస్తున్నారు. ఎవరూ శాప్ ఆఫీస్ దగ్గరికి వెళ్లకుండా అడ్డగించారు.

## సముద్రంలో మునిగిన బోటు

కోనసీమ సెప్టెంబర్ 21, కోనసీమ జిల్లా భైరవపాలెం మొగలో మత్స్యకారుల బోటు మునిగిపోయింది. గ్రామానికి చెందిన చింత శ్రీను బోటుపై తొమ్మిది మంది మత్సకారులు వేటకు వెళ్లారు. గాలి వేగంగా వీయడంతో బోటు ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగిపోయింది. మరొక బోటు సహాయంతో మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు

# బాలాజీనగర్ బిడ్డల వైద్య విజయం..!

# ఒకేసారి ఆరుగురికి ఎంబీబీఎస్ సీట్లు

### నీట్‌లో ప్రతిభ.. ఆరు కుటుంబాల్లో ఆనందం.. ప్రాంతమంతా గర్వం
### పేదరికం అడ్డుకాలేదు.. పట్టుదలే ఆయుధమైంది
### విద్యార్థులకు ఘన సత్కారం



జన నిర్ణయం । వరంగల్ (సెప్టెంబర్ 21) :

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఒకేసారి ఆరుగురు..! ఒకే ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు వైద్య విద్యలో అడుగుపెట్టడం ఏనుమాముల బాలాజీనగర్ చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులు, బేడ బుడగ జంగాల కాలనీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. దీంతో ఆ ప్రాంతంలో విద్యా విజయోత్సవ వాతావరణం నెలకొంది. వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్‌లో ప్రతిభ కనబరచడం అంత సులభమైన విషయం కాదు. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా అవసరం. ఈ నేపథ్యంలో బాలాజీనగర్, బేడ బుడగ జంగాల కాలనీలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం స్థానికంగా విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.

సాధారణ కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడం మరెందరో యువతకు స్ఫూర్తినిచ్చే అంశంగా మారింది. చదువుపై నమ్మకం ఉంటే పరిస్థితులు ఎన్ని ప్రతికూలంగా ఉన్నా లక్ష్యాన్ని చేరుకోవచ్చునే సందేశాన్ని ఈ విజయం చాటుతోంది.

పేదరికాన్ని దాటి.. వైద్య విద్య వైపు..!

విద్యార్థుల విజయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ చదువును వదలకుండా లక్ష్యాన్ని సాధించిన విద్యార్థుల కృషిని అభినందిస్తున్నారు.

ఒక ప్రాంతం నుంచి ఒకేసారి ఆరుగురు విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం పొందడం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం మాత్రమే కాదు. ఆ ప్రాంతంలో విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యతకు కూడా ఇది ఒక సంకేతం. ఇప్పటి వరకు ఈ ప్రాంతం గురించి వివిధ సమస్యల నేపథ్యంలో చర్చ జరిగి ఉండొచ్చు. కానీ అదే ప్రాంతం నుంచి ఆరుగురు యువత వైద్య విద్యలో అడుగుపెట్టడం ద్వారా “చదువుతో మన ప్రాంతం పేరు నిలబెట్టుకోవచ్చు” అనే కొత్త చర్చకు తెరలేపింది.

విజయాన్ని గుర్తించిన సమాజం

ఆరుగురు విద్యార్థుల ఘనతను పురస్కరించుకుని శ్రీ కైలాస ఈశ్వర, ఆంజనేయస్వామి, పోచమ్మ దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏనుమాముల సీఐ జవ్వాజి సురేష్, 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సులోచన--సారయ్య, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులను శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. వారి కుటుంబ సభ్యులను కూడా అభినందిస్తూ విద్యార్థుల భవిష్యత్ ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. సత్కార కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు విద్యార్థుల భవిష్యత్తుపై ఆకాంక్షలు వ్యక్తం చేశారు. తమ ప్రాంతం నుంచి వైద్యులుగా ఎదిగే ఈ యువత భవిష్యత్తులో పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య విద్యలో ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు మానవీయ విలువలను కాపాడుకుంటూ సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. తమ వ్యక్తిగత విజయాన్ని సమాజ ప్రయోజనానికి ఉపయోగించినప్పుడే విద్యకు నిజమైన అర్థం వస్తుందని పేర్కొన్నారు. బాలాజీనగర్ బిడ్డలు సాధించిన ఈ విజయం సత్కార కార్యక్రమంతో ముగిసిపోకూడదనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది విద్యార్థులు వైద్య, ఇంజినీరింగ్, ఉన్నత విద్య వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

ప్రతిభ ఉన్న విద్యార్థులకు కుటుంబాలు అండగా నిలవాలి. సమాజం ప్రోత్సహించాలి.

అవసరమైన చోట విద్యా సహాయం అందించాలి. అప్పుడే ఒకరి విజయం మరో పది మందికి దారి చూపుతుంది. ఈ ఆరుగురు విద్యార్థుల విజయం కూడా అలాంటి మార్పుకు ఆరంభం కావాలి. బాలాజీనగర్ చరిత్రలో కొత్త పుట ఒకే ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఒకేసారి ఎంబీబీఎస్ సీట్లు సాధించడం వారి కుటుంబాలకు మాత్రమే కాదు.. మొత్తం ప్రాంతానికి గర్వకారణం. ఆరు కుటుంబాల్లో ఆనందం.. ఒక ప్రాంతంలో సంబరం..వందలాది మంది యువతకు స్ఫూర్తి..

బాలాజీనగర్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం!

చదువు గెలిచింది.. పట్టుదల గెలిచింది..

బాలాజీనగర్ బిడ్డలు గెలిచారు!

## హమాలీల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి



జననిర్ణయం/రేగొండ:

మండలంలోని హమాలీ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మండల సీపీఐ కార్యదర్శి పెంట రవి, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నారపు రాజేందర్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం, ఎరువుల దుకాణాలు, రైస్ మిల్లులు, ఇతర ప్రాంతాల్లో హమాలీలు బరువులు మోస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం లభిస్తున్న కూలి కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు.

50 కిలోల వడ్ల బస్తాకు ఎగుమతి, దిగుమతి కూలీగా రూ.40 చెల్లించాలని, మొక్కజొన్న క్వింటాకు రూ.100, పత్తికి రూ.200, వడ్లకు రూ.120 కూలీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 50 కిలోల పిండి బస్తాకు ఎగుమతి, దిగుమతి కూలీగా రూ.40 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

హమాలీ కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన హమాలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ప్రతి కార్మికుడికి ఏడాదికి రెండు జతల దుస్తులు అందించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఆయా గ్రామాల హమాలీ సంఘాల ప్రతినిధులు, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలి

కమాన్‌పూర్, ఎప్టెంబర్ 21,

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిజమైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమాన్‌పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు.మొదటి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు దక్కలేదని విమర్శించారు. ఇందులో కొందరు దళారులు చేతివాటం చూపిస్తున్నారని ఆరోపించారు.రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు దుస్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, కొట్టే భూమయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ రవి, జాబు సతీష్, దండే కిషన్, కొయ్యడ రవి, రాచకొండ చంద్రమౌళి,, పెండ్లి నారాయణ, ఎలబోయిన రామ్మూర్తి, నడిగట్టు సంపత్, ఆకుల రమేష్, చిప్పకుర్తి రాజ్ కుమార్, చిప్పకుర్తి శ్రీనివాస్, బోయిని బాలకృష్ణ, పంతకాని రవి, సుధాకర్, మానక ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి డాక్టర్ కడియం కావ్య



జన నిర్ణయం / ధర్మసాగర్ : 2029లో జరిగే లోక్ సభ, శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ఏకైక లక్ష్యంగా కొత్త, పాత అనే బేధాలు లేకుండా అందరం కలిసి పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. హనుమకొండజిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో సోమవారం నిర్వహించిన ధర్మసాగర్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం మరియు మండల విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన మండల కమిటీ కార్యవర్గ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులను శాలువాలతో సత్కరించి కొత్తగా మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ సారథులుగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం, శ్రీహరి ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..మనందరి ఏకైక ఎజెండా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పేద ప్రజలకు చేర్చడం, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మనతో కలిసి రావడానికి ఇష్టంగా ఉన్న ఇతర పార్టీల నాయకులను పార్టీలోకి ఆహ్వానించాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రజల మధ్యలో ఉంటూ పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవ ర్గంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా మనందరం కలిసి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఏ కార్యక ర్తకు ఏ అవసరం ఉన్నా నేరుగా నన్ను కలువవ చ్చని, మీ పనిలో న్యాయం ఉంటే తప్పకుండా చేసేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తానని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలి, రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని అందుకు ప్రతీ కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభు త్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓర్వలేక పోతున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసే దాడిని గట్టిగా తిప్పికొట్టాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వం 12ఏళ్లలో తెలంగాణకు ఎం ఇచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక 1000 కోట్ల ప్రాజెక్టు ఇవ్వలేదని, ఒక జాతీయ సంస్థను మంజూరు చేయలేదని అన్నారు. కులతత్వ, మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టడం తప్ప పేద ప్రజల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీకి ప్రజలపై, రాజ్యాంగంపై నమ్మకం లేదని, దళితులు, మైనారిటీలు, పేద ప్రజలు అంటే గిట్టదని అన్నారు. బీజేపీ నాలుగవసారి అధికారంలోకి రావాలని చూస్తోందని, బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే మన హక్కులు పోతాయని అన్నారు. భారత దేశ మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీని బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పని గట్టుకొని విష ప్రచారాలు చేస్తున్నాయని బిఆర్ఎస్, బీజేపీల దాడిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. అందుకు మనమందరం కలిసి కట్టుగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల కుటుంబం 10ఏళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని వందల ఎకరాల భూమిని ఆక్రమించుకురాని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు ధరణిని అడ్డంపెట్టుకొని ఏ రకంగా పేదల భూములను ఆక్రమించుకున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వివరాలతో సహా వెల్లడించారాని తెలిపారు. కేసీఆర్ కుటుంబానికి 2014ఎన్నికల అఫిడవిట్ లో ఒక్క ఎకరం లేదని చెప్పిన మీకు వందల ఎకరాలు, ఫామ్ హౌస్ లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులన్నీ కూడా అధికారాన్ని అడ్డంపెట్టుకొని అక్రమంగా సంపాదించినవే అని ఆరోపించారు. 2014కు ముందు మీ ఆస్తులు ఎన్ని ఇప్పుడు మీ ఆస్తులు ఎన్ని, అవి ఎప్పుడు, ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఒక్క కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JANNU SUNITHA, Printed at SV Offset Printers, H.NO.7-1-133/3 Opp New bus stand, Hanumakonda, Warangal - 506001 Published at 11-23-2348, CKM College Road, Kalyani Nagar, Warangal, Telangana 506006. Editor: RAJENDER DAMERA, RNI No. APTEL/2010/31898.. e-mail : jananirnayam2022@gmail.com cell : 94930 87222